నేడు మన్యం బంద్

టెక్కలి, మార్చి 9: ఆదివాసీ నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయంపై ఆదివారం మన్యం బంద్ నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.మోహనరావు తెలిపారు. శనివారం బెండకాయల పేటలో బంద్‌పై గిరిజనులను చైతన్య పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఐసీడీఎస్ నియామకాల్లో గిరిజనేతరులతో భర్తీ చేశారు. ఐటీడీఏ పరిధిలో 517 టీచర్ పోస్టులకుగానూ 38 మాత్రమే ఆదివాసీలకు కేటాయించడం దారుణం. గిరిజనులకు రిజర్వేషన్లు పక్కాగా అమలు చేయడం లేదు. ఏజెన్సీలో శతశాతం ఉద్యోగాలు ఆదివాసీలకే కేటాయించాలి. స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి' అని డిమాండ్ చేశారు.

4 నెలలుగా.. బిల్లుల్లేవ్

- హాస్టళ్లకు డైట్ నిధులు చెల్లించని ప్రభుత్వం
- రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిలు
- విద్యార్థులకు సక్రమంగా అమలుకాని మెనూ



బెల్లుపడ కాలనీలో బీసీ హాస్టల్



హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

(ఇచ్ఛాపురం)

హాస్టళ్లకు సంబంధించిన డైట్ బిల్లులను ప్రభుత్వం చెల్లించడం లేదు. నెలల తరబడి పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులకు సక్రమంగా మెనూ అమలు కావడం లేదు. తాజాగా బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు టోకెన్ నెంబర్లను కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఫలితంగా ఒక్కో సంక్షేమశాఖలో నాలుగు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో మెనూను అమలు చేయడం వార్డెన్లకు తలకుమించిన భారంగా మారింది. జిల్లాలోని 63 బీసీ హాస్టళ్లలో 8 వేల మంది, 30 ఎస్సీ హాస్టళ్లలో 2వేల మంది, 25 ఎస్టీ హాస్టళ్లలో 3వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. మెనూ అమలు కోసం ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1,400 చొప్పున ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంది. కానీ, ప్రభుత్వం నాలుగు నెలలుగా చెల్లించకపోవడంతో రూ.కోట్లలో బిల్లులు బకాయిలు ఉన్నాయి. ఎస్సీ సంక్షేమ శాఖ పరిధిలో నవంబరు నుంచి డైట్ బిల్లులు అందాల్సి ఉంది. బిల్లులన్నీ అప్‌లోడ్ చేసినా ఒక్కటీ మంజూరు కాలేదని వార్డెన్లు లబోదిబోమంటున్నారు. బీసీ సంక్షేమశాఖలో డిసెంబరు నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏబీసీడబ్ల్యూలు, జిల్లాస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు బిల్లులను ప్రభుత్వానికి పంపుతున్నా నిధులు విడుదల చేయడం లేదు. హాస్టళ్ల నిధులను ప్రభుత్వం సంక్షేమ పథకాలకు మళ్లిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డైట్ బిల్లుల చెల్లింపు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. డిసెంబరు వరకు బిల్లులను వార్డెను అప్‌లోడ్ చేశారు. ప్రభుత్వం టోకెన్ నెంబర్లు ఇవ్వకపోవడంతో జనవరి నుంచి బిల్లులు అప్‌లోడ్ చేయలేకపోయారు. సీఎఫ్ఎంఎస్ నుంచి టోకెన్ నెంబర్లు వస్తేనే వార్డెన్లు బిల్లులు సబ్‌మిట్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ఈ ప్రక్రియ మొత్తం ఆగిపోతుందని, కొత్త ప్రభుత్వం ఏర్పడేదాకా బిల్లుల కోసం వేచిచూడాల్సి ఉంటుందని అధికారులు, వార్డెన్లు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి డైట్ బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

జిల్లాలోని హాస్టళ్లకు మూడు నెలలుగా డైట్ బిల్లులు అందడం లేదు. ఈ విషయాన్ని డైరెక్టర్ ఆఫ్ బీసీ వెల్ఫేర్ అధికారులకు తెలియజేశాం. త్వరలో బిల్లులు చెల్లిస్తారు. పిల్లలకు పరీక్షలు దగ్గర పడుతున్నాయి. వారికి నాణ్యమైన భోజనం అందించాలంటే డైట్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం ఉంది. లేకపోతే వార్డెన్లకు షాపుల్లో సరుకులు అరువు ఇవ్వరు. పిల్ల లకు మెనూ ప్రకారం భోజనం అందించడం వార్డెన్లకు భారంగా మారింది. ఎన్నికల నోటిఫి కేషన్ రాకముందే బిల్లులు చెల్లిస్తే బాగుంటుంది. త్వరలో సమస్య పరిష్కారం అవుతుంది.

-అనురాధ,
జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి

టోకెన్లు రావడం లేదు

గత ఏడాది డిసెంబరు నుంచి డైట్ బిల్లులు అందడం లేదు. దీంతో హాస్టల్ వార్డెన్లకు డైట్ నిర్వహణ భారంగా మారుతోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. బిల్లులకు సంబంధించి బడ్జెట్ వచ్చింది. కానీ, దానికి సంబంధించిన టోకెన్ రావడం లేదు. టోకెన్ నెంబర్ వచ్చిన వెంటనే బిల్లులు అవుతాయి.

-టీఎం రావు,
అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం..



నాలుగు నెలలుగా డైట్ బిల్లులు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దుకాణదారులు అరువుపై సరుకులు ఇవ్వడం లేదు. వారికి రూ.లక్షల్లో బకాయిలు ఉన్నాం. దీనివల్ల పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెట్టడానికి నానా తంటాలు పడుతున్నాం. అధికారులు స్పందించి బిల్లులు చెల్లించాలి.

-రవికుమార్, వార్డెన్,
ఇచ్ఛాపురం బీసీ హాస్టల్



అచ్చెన్న సమక్షంలో టీడీపీలో చేరిన కొల్లివలస గ్రామస్థులు

వైసీపీ నుంచి టీడీపీలోకి..

- అచ్చెన్న సమక్షంలో 30 కుటుంబాలు చేరిక

టెక్కలి, మార్చి 9: ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు పెరుగుతున్నాయి. శనివారం టెక్కలి నియోజకవర్గంలో 30 కుటుంబాలు వైసీపీని వీడాయి. ఆ కుటుంబాలన్నీ కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరాయి. టెక్కలి మండలం చాకిపల్లికి చెందిన నక్క జడ్డయ్య వై.వసంతరావుతోపాటు కొల్లివలసకు చెందిన కె.శ్రీనివాసరావు, ఎస్.రామారావు, వి.శాఖారావు, బి.చంద్రరావు, వి.రాజారావు, పి.చంద్రయ్య ఎం.నాగేసు, ఎస్.అప్పారావు, చిట్టి, ఎన్.నీలయ్య, ఎం.రామారావు తదితరులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అలాగే నందిగాం మండలం కామధేనువు గ్రామానికి చెందిన కె.బాలకృష్ణ, కృష్ణారావు, మోహన్, సుబ్బారావు, సాయికుమార్, ధనుంజయ తదితరులను అచ్చెన్న సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టెక్కలి, నందిగాం మండల పార్టీల అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, పోలాకి షణ్ముఖరావు పాల్గొన్నారు.

సీఎం సభ అంటే అంతేమరి

- జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ బస్సులు
- ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

టెక్కలి, మార్చి 9: ప్రజారవాణా సంస్థ అయిన ఆర్టీసీ.. మరోసారి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసింది. తరచూ ముఖ్యమంత్రి జగన్ నిర్వహించే సభలకు జిల్లా నుంచి ఆర్టీసీ సర్వీసులు తరలించడం పరిపాటిగా మారింది. ఈసారి బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఆదివారం నిర్వహించనున్న 'సిద్ధం' మహాసభకు జిల్లా నుంచి 53 ఆర్టీసీ సర్వీసులు శనివారమే ఇద్దరేసి డ్రైవర్లతో బయలుదేరాయి. శ్రీకాకుళం-1వ డిపో నుంచి 15 బస్సులు, శ్రీకాకుళం-2 డిపో నుంచి 16 బస్సులు, టెక్కలి, పలాస డిపోల నుంచి చెరో 11 బస్సులు వెళ్లడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రజారవాణా సంస్థ ఉన్నతాధికారులకు పెద్దసంఖ్యలో బస్సులు పంపించాలని ఆదేశాలు రావడంతో ఇబ్బడిముబ్బడిగా వాటిని అమలుచేశారు. మూడురోజుల కిందట అనకాపల్లిలో జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన చేయూత సభకు కూడా జిల్లా నుంచి బస్సులు తరలివెళ్లాయి. కాగా ఓవైపు పరీక్షలు, మరోవైపు పెళ్లిళ్లు, గృహప్రవేశాలు, ఇతర పండగ సమయాల్లో ఆర్టీసీ బస్సులు సీఎం సభకు తరలివెళ్లడంపై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. ఈ విషయమై జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా జిల్లా నుంచి 50 బస్సులు శనివారం మధ్యాహ్నం మేదరమెట్ల బయలుదేరాయని, ఆదివారం రాత్రికి ఇక్కడకు చేరుకుంటాయని తెలిపారు. ఆయా రూట్లలో పలు సర్వీసులు సర్దుబాటు చేశామని తెలిపారు.



ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న వాబయోగి, సింహాచలం

నకిలీ బెంతు ఒరియాలను ఎస్టీల్లో చేర్చొద్దు

- పాతపట్నంలో గిరిజన సంఘాల నేతల ఆమరణ నిరాహార దీక్ష

పాతపట్నం, మార్చి 9: నకిలీ బెంతు ఒరియాలను ఎస్టీల్లో చేర్చొద్దంటూ గిరిజన సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియను అడ్డుకోవాలంటూ శనివారం పాతపట్నంలో ఆదివాసీ సంక్షేమపరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి, ప్రధానకార్యదర్శి బైదలాపురం సింహాచలం ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గురాడి అప్పన్న మాట్లాడుతూ.. సమస్య శాశ్వత పరిష్కారం కోసం దీక్ష చేపడుతున్నామన్నారు. వాబ యోగి మాట్లాడుతూ.. జిల్లాలో బెంతు ఒరియాలు లేరని, బీసీ-ఎలో ఉన్న వడ్డి కులస్థులే ఎస్టీ నకిలీ బెంతు ఒరియాలుగా చెలామణి అవుతున్నారన్నారు. దశాబ్దాలుగా ఈ సమస్యను ప్రభుత్వాలు, ప్రతిపక్షాల దృష్టికి తీసుకువెళుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలు పాటించని వడ్డి కులస్థులను ఎస్టీల్లో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా రానున్న ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో ఆదివాసీ అభ్యర్థులను పోటీలో నిలబెడతామని దీనికి ఆదివాసీలు సిద్ధం కావాలన్నారు. బైదలాపురం సింహాచలం మాట్లాడుతూ. ప్రాణాలర్పించైనా ఆదివాసీల హక్కులను పరిరక్షించుకుంటామన్నారు. దళితహక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు యడ్ల గోపి సంఘీభావం తెలిపారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గాయకుడు ఉదయ్‌భాస్కర్, ఆజారి రామారావు, డొల్లు శ్రీనివాసరావు, బెహర జమ్మయ్య, సిద్దిపాలెం గౌరీశ్, మల్లిపురం శ్రీను, సుందరాడ తవిటినాయుడు, బైరిసింది చిన్నబాబు, కొల్ల రాంబాబు పాల్గొన్నారు.

రారండోయ్.. వేడుక చూద్దాం



నువ్వలరేవులో సామూహిక వివాహం (ఫైల్)

- నువ్వలరేవులో 16న సామూహిక వివాహాలు
- ఒకే ముహూర్తానికి ఒక్కటవ్వనున్న 61 జంటలు

(వజ్రపుకొత్తూరు)

ఆచార సంప్రదాయాలకు నిలయమైన నువ్వలరేవు.. సామూహిక వివాహాల వేడుకకు సిద్ధమవుతోంది. ఈ గ్రామంలోని కేవీటీ కులస్థుల్లో ప్రతి రెండేళ్లకోసారి సామూహిక వివాహాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 16న అర్ధరాత్రి దాటాక 1.55 గంటలకు సామూహిక వివాహాలు చేయాలని కుల పెద్దలు నిశ్చయించారు. ఒకే ముహూర్తానికి 61 జంటలు ఒక్కటి కానున్నాయి. గతంలో మూడేళ్లకోసారి పెళ్లి వేడుకలు జరిగేవి. పెరుగుతున్న జనాభా నేపథ్యంలో రెండేళ్లకోసారి సామూహిక వివాహాలు చేస్తున్నారు. వధూవరులు ఇద్దరూ ఈ గ్రామస్థులే కావడంతో మొత్తం 122 ఇళ్ల వద్ద పెళ్లి సందడి వాతావరణం నెలకొంది.

సంప్రదాయాలు.. ప్రత్యేకతలెన్నో

- నువ్వలరేవులో సామూహిక వివాహాల నిర్వహణ వెనుక ఎన్నో ప్రత్యేకతలు, పద్ధతులు, ఆచార సంప్రదాయాలు ఉన్నాయి. వివాహాల ప్రక్రియలో కులపెద్దలదే ప్రధాన పాత్ర. వారి పర్యవేక్షణలోనే తంతు పూర్తవుతుంది. ఈ గ్రామంలో అధికశాతం కేవీటీ సామాజిక వర్గీయులే. చేపల వేట, క్రయ విక్రయాలే ప్రధాన జీవనాధారం. వివాహం, విందు భారం కావడంతో పూర్వీకులే సామూహిక వివాహాలకు శ్రీకారం చుట్టారు. 300 ఏళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగిస్తూనే ఉన్నారు. రెండేళ్లకోసారి కులపెద్దలు గ్రామంలో సమావేశం నిర్వహించి.. సామూహిక వివాహాలకు ముహూర్తాన్ని నిర్ణయిస్తారు. గ్రామంలో చాటింపు వేయించి వివాహాలకు సిద్ధంగా ఉన్నవారి పేర్లు నమోదు చేయిస్తారు.



నువ్వలరేవు గ్రామం

- పెళ్లిళ్ల నేపథ్యంలో మూడు రోజులపాటు గ్రామంలో సందడి వాతావరణం కనిపిస్తుంది. వేడుకల్లో భాగంగా తొలిరోజు పందిరి రాట వేస్తారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆటలాడతారు. రెండోరోజు మాంగళ్యధారణ నిర్వహిస్తారు. మూడోరోజు వధువు పుట్టింటి నుంచి చీర,సారె, లాంఛనాలు వరుడి ఇంటికి చేరుకుంటాయి. గ్రామంలో వెలసిన బృందావతిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన తర్వాత పెళ్లి పనులకు శ్రీకారం చుడతారు. కుల సంప్రదాయం ప్రకారం వధువు ఇంటి వద్దనే పెళ్లి వేడుకలు నిర్వహిస్తారు. వరుడు కుటుంబ సభ్యులతో సహా వధువు ఇంటికి పెళ్లి రోజు సాయంత్రం వస్తారు. తిరిగి రెండో రోజు సాయంత్రం సారి, కానుకలు ఇతర సామానులతో వధూవరులు పెళ్లి కుమారుడు ఇంటికి చేరుకుంటారు. దీంతో పెళ్లి తంతు ముగిస్తారు.
- వధూవరులిద్దరూ ఈ గ్రామస్థులే కావడం గమనార్హం. గ్రామస్థులంతా దాదాపు బంధువులే. అయితే బంధువులందరినీ పెళ్లి భోజనాలకు పిలవరు. ఒక్కో పెళ్లికి ఇరవై, ముప్పై కుటుంబాలవారు భోజనాలకు వెళతారు. ఎవరు ఏ ఇంటికి వెళ్లాలనే విషయాన్ని గ్రామ పెద్దలు నిర్ణయిస్తారు. ముహూర్తం వేళ.. ముందుగా వరుడు వధువు మెడలో తాళి కడతాడు. అనంతరం వధువు వరుడి మెడలో 'దురుషం' అనే చిన్న బంగారు ఆభరణం కట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. రెండేళ్లకోసారి సంప్రదాయ బద్ధంగా నిర్వహించనున్న ఈ సామూహిక వివాహాల వేడుకను చూసేందుకు చుట్టు పక్కల గ్రామస్థులు అధికంగా తరలివస్తారు.

300 ఏళ్లుగా కొనసాగుతోంది



నువ్వలరేవులో సాముహిక వివాహ వేడుకల సంప్రదాయం సుమారు 300 ఏళ్ల నుంచి కొనసాగుతోంది. ఒకే ముహూర్తానికి పెళ్లి వేడుకలు నిర్వహించనుండడంతో పెళ్లి ఇంటి వారికి భోజనాల ఖర్చులు చాలావరకు తగ్గుతాయి. గ్రామంలో పదివేల మందికిపైగా జనాభా ఉన్నారు. వారందరినీ పెళ్లి ఇళ్లకు సర్దుబాటు చేస్తాం. దీంతో బంధుత్వాలు బలంగా ఉండడంతో పాటు అందరినీ భోజనాలకు ఆహ్వానించినట్లవుతుంది. ఈ ఏడాది 61 జంటలు ఒక్కటి కానున్నాయి. వేడుకల్లో భాగంగా ఆయా కుటుంబాలకు సహాయసహకారం అందించి.. ఏ ఇబ్బందులు లేకుండా చూసుకుంటాం.

- ఏజ్రా, సర్పంచ్, నువ్వలరేవు

గ్రామమంతా ఒకే మాట



నువ్వలరేవు గ్రామస్థులమంతా ఒకే మాట మీద ఉంటాం. పెళ్లిళ్లు, పండుగలు అన్నీ కలసి కట్టుగా చేసుకుంటాం. సామూహిక వివాహాల్లో పెళ్లి ఇంటి వారికి సహకారాలు అందిస్తాం. మా మధ్య ధనిక, పేద అనే తేడాలు లేవు.

-బైనపల్లి భీమారావు,
మాజీ ఎంపీటీసీ, నువ్వలరేవు

శ్రీముఖలింగేశ్వరుడి చక్రతీర్థం రేపు

- మిరియాపల్లి రేవులో ఏర్పాట్లు

జలుమూరు/ ఎల్.ఎన్.పేట, మార్చి 9: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీముఖలింగేశ్వరుడి చక్రతీర్థ స్నానాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎల్.ఎన్.పేట మండలం మిరియాపల్లి వద్ద వంశధార నదిలో ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల తరువాత శ్రీముఖలింగంలో పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను నందివాహనంపై ఊరేగింపుగా మిరియాపల్లి రేవుకు తీసుకువస్తారు. సంప్రదాయబద్ధంగా చక్రతీర్థాలు నిర్వహించనున్నారు. పరిసర ప్రాంతాలతోపాటు జిల్లావ్యాప్తంగా సుమారు లక్ష మందికిపైగా భక్తులు ఉత్సవంలో పాల్గొనున్నారు. భక్తులకు అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా.. బారికేడ్లు ఏర్పాటు చేసి.. గట్టి బందోబస్తు సిద్ధం చేశారు. ఏర్పాట్లను శ్రీకాకుళం డీఎస్పీ వై.శ్రుతి శనివారం పరిశీలించారు. బారికేడ్లు పటిష్ఠంగా నిర్మించి.. విశాలాన్ని పెంచాలని సూచించారు. డబుల్‌లైన్ బారికేడ్లు ఏర్పాటు చేశామని ఆర్ అండ్‌బీ ఏఈ యోగీశ్వర రావు తెలిపారు. కార్యక్రమంలో ఆమదాలవలస సీఐ దివాకర్, సరుబుజ్జిలి, గార ఎస్ఐలు నిహార్, కృష్ణప్రసాద్, కాంట్రాక్టర్ మోహనరావు పాల్గొన్నారు.

నీరేదీ?

చక్రతీర్థ స్నానాలకు 2లక్షలకుపైగా భక్తులు హాజరవుతారని అధికారుల అంచనా. కాగా ప్రస్తుతం వంశధార నదిలో నీటి ప్రవాహం సెలఏరులా ఉండడంతో భక్తులు ఎలా పుణ్యస్నానాలు ఆచరిస్తారని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వంశధార జేఈ పరిశుద్ధబాబును వివరణ కోరగా నదిలో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నందున నీటి ప్రవాహం తగ్గించామని తెలిపారు. ఆదివారం 150 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెట్టేలా చర్యలు చేపడతామన్నారు.





మిరియాపల్లి రేవులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రుతి



అడుగంటిన వంశధార

వంశధార నది రోజురోజుకూ అడుగంటిపోతోంది. క్యాచ్‌మెంట్ ఏరియాలో కొన్ని నెలలుగా వర్షాలు లేకపోవడంతో ఇన్‌ఫ్లో తగ్గింది. దీంతో హిరమండలంలోని గొట్టా బ్యారేజీ ఎగువ ప్రాంతంలో ఇసుక మేటలు కనిపిస్తున్నాయి. బ్యారేజీ వద్ద నీటిమట్టం తగ్గి రబీ పంటలకు సాగునీరందే పరిస్థితి లేదు. ప్రస్తుతం 140 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా బ్యారేజీ వద్ద 36.01 మీటర్లు నీరు నిల్వ ఉంది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వస్తున్న నీటిలో 110 క్యూసెక్కులు ఎడమ కాలువకు విడిచిపెడుతున్నారు. శ్రీముఖలింగేశ్వరస్వామి చక్రతీర్థ స్నానం సోమవారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బ్యారేజీ నుంచి నది దిగువకు శనివారం 80క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు.

- హిరమండలం

'సూపర్ సిక్స్'తో పేదలకు మేలు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

పొందూరు, మార్చి 9: టీడీపీ-జనసేన అమలుచేయనున్న సూపర్‌సిక్స్ పథకాల ద్వారా రాష్ట్రంలో పేదలకు మేలు చేకూరుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. బి.కంచరాం గ్రామంలో శనివారం 'శంఖారావం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న దుష్ట పాలనను అంతమొందించి ప్రజలకు మెరుగైన పాలన టీఈపీ-జనసేనతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. టీడీపీ-జనసేన కూటమిని చూసి సీఎం జగన్‌రెడ్డి భయపడుతున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి వండాన మురళి, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు అన్నెపు రాము, నేతలు బలగ శంకర్‌భాస్కర్, బాడాన గిరి, కొంచాడ బుజ్జి వాసు తదితరులు పాల్గొన్నారు.



పొందూరు: సూపర్ సిక్స్‌పై అవగాహన కలిగిస్తున్న రవికుమార్

డివిజన్ ఇన్‌చార్జి పీవీఎస్ మధుసూదనరావు, శ్రీదేవి, అప్పారావు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

మూడు పార్టీలతో వికాసం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

అరసవల్లి: మూడు రాజధానుల పేరిట సీఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి విమర్శించారు. శనివారం నగరంలోని 32వ డివిజన్‌లో 'కలలకు రెక్కలు, సూపర్ సిక్స్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా చంద్రబాబు జనసేన, బీజేపీతో కలిసి ఎన్నికల్లో ఘన విజయం సాధించనున్నారన్నారు. రాబోయే ప్రభుత్వం లో మహిళల కోసం 'కలలకు రెక్కలు' కార్యక్రమాన్ని ఖచ్చితంగా అమలు చేస్తామని, ఆర్థికంగా మహిళలు చదువులో వెనుకబడి ఉండరాదన్న ఉద్దేశంతో ఈ పథకం రూపకల్పన చేశారన్నారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ కలలకు రెక్కలు పథకాలను వివరించారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్,

బాబుతోనే అభివృద్ధి

లావేరు: టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. శనివారం పెదకొత్తపల్లి, విజయరాంపురం, కొత్తూరుపేట, కంది పేట గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, సర్పంచ్ ఆరెళ్ల కృష్ణ, నాయకులు ఐ.తోటయ్యదొర, లంక నారాయణరావు, పిన్నింటి మధుబాబు, ఎం.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



లావేరు: పెదకొత్తపల్లి, ఇచ్ఛాపురం, ఆమదాలవలసల్లో సూపర్ సిక్స్‌పై ప్రచారం చేస్తున్న రామ్‌మల్లిక్ నాయుడు, టీడీపీ నేతలు కార్యకర్తలు

● **జి.సిగడాం:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్ కోరారు. శనివారం డీఆర్‌వలస, పెంట, నాగులవలస, పెనసాం, నడిమి వలస, మదుపాం, బాతువ తదితర గ్రామాల్లో బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కూనుబిల్లి కూర్మారావు, నేతలు బోగాది అప్పలనాయుడు, మీసాల విజయమ్మ పాల్గొన్నారు.

● **ఆమదాలవలస:** త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ తీన్మార్ పొత్తులతో పోటీ చేస్తున్నందున వైసీపీ హడలెత్తిపోతోందని టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. శనివారం ఆమదాలవలస మునిసిపాలిటీ 13వ వార్డు విద్యానగర్, కిల్లివారి క్వార్టర్స్, ధర్మారావు క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. నాయకులు బొడ్డేపల్లి రమణమూర్తి, తిర్లంగి నారాయణమూర్తి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ● కొర్లకోటలో టీడీపీ జిల్లాకార్య నిర్వాహక కార్యదర్శి సనపల డిల్లేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కలిగించారు. టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ఇంటిం టికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించాలని, టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థులు కూన రవికుమార్, కింజరాపు రామ్మోహన్ నాయుడులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అన్నెపు భాస్కరరావు, గుండు రవి, సానపల్లి తేజ, అన్నెపు కిషోర్ పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం:** టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్ సాధ్యమని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్ అన్నారు. శనివారం 21వ వార్డు పరిధిలో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కలిగించారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపాలని, టీడీపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నాయకుడు సాలిన జగదీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● **వజ్రపుకొత్తూరు:** టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రం మళ్లీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని టీడీపీ నేత కదంబాల వెంకటరమణ అన్నారు. శనివారం నువ్వలరేవులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ-జనసేన ప్రభుత్వం అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. టీడీపీ-జనసేన కూటమి విజయానికి సహకరించాలని కోరారు.

● **జలుమూరు (సారవకోట):** టీడీపీ అధినేత చంద్రబాబు నాయకత్వంలో పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. బుడితి గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నిక్కు హరిసత్యనారాయణ, నాయకులు ముద్ద భీమారావు, ఎం.ప్రతాప్, చల్ల ఆనందరావు, వేణుగోపాలరావు, డి.జయరాం పాల్గొన్నారు.



సారవకోట మండలం బుడితి, వజ్రపుకొత్తూరు: నువ్వలరేవు, జి.సిగడాం మండలంలో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

పేరు.. శిలాఫలకాలపై ఇదేం తీరు!



శిలాఫలకంపై తిలక్ పేరు (సర్కిల్‌లో)

నందిగాం, మార్చి 9: ప్రజల ద్వారా ఎన్నికైన పాలకుల పేర్లు శిలాఫలకాలపై పొందుపరచాలి. కానీ, వైసీపీ జిల్లా సమన్వయకర్త పేరును పొందుపరచడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శని వారం నందిగాం మండలం కణితి వూరు, హరిదాసుపురం గ్రామాల్లో రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, సచివాలయాల్లో శిలాఫలకాలను వైసీపీ జిల్లా సమన్వయకర్త పేడాడ తిలక్, ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తితో కలిసి ఆవిష్కరించారు. అయితే శిలాఫలకాలపై తిలక్ పేరు పెట్ట డంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. ప్రజలతో ఎన్నుకోకుండా.. రాజకీయ పదవితో ఉన్న వ్యక్తికి ప్రాధాన్యం ఇవ్వడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీవో జి.శివప్రసాద్‌ను వివరణ కోరగా.. తాను అందుబాటులో లేనని, కార్యాలయాలు సెలవని, ఆ విషయం తనకు తెలియదని ఆయన పేర్కొన్నారు.

చక్రతీర్థ స్నానాలకు దారి ఏర్పాటు

జలుమూరు: శ్రీముఖలింగేశ్వరస్వామి చక్రతీర్థ స్నానాలకు అధికారులు దారి చూపారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'చక్రతీర్థ స్నానాలకు దారేది?' శీర్షిక తో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పొలాల్లో ఉన్న మొక్కజొన్న పంటను కొంతమేర తొల గించి తాత్కాలికంగా మార్గం ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో చెత్తా చెదారాలను తొలగించి స్వామిని తీసుకువెళ్లేందుకు వీలుగా చర్యలు చేపట్టారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



జొన్నపంటను తొలగించి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దారి

ఓపీఎస్‌ను మేనిఫెస్టోలో పెట్టాలి

● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



టెక్కలి: సదస్సులో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

టెక్కలి/పాతపట్నం/ నరసన్నపేట: సామాజిక భద్రత కల్పించే పాత పెన్షన్ విధానం (ఓపీ ఎస్)ను అధికారంలోకి వచ్చిన తరు వాత అమలు చేస్తామని అన్ని పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. 'ఓట్‌ఫర్ ఓపీఎస్'లో భాగంగా టెక్కలి, పాత పట్నం, నరసన్నపేటల్లో శనివారం ప్రాంతీయ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లా డుతూ.. పెన్షన్ ఉద్యోగుల హక్కు అని, ఇది పాలకుల భిక్ష కాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కార్పొరేట్లకు మేలు చేకూర్చే సీపీఎస్, జీపీఎస్ విధానాలను అమలు చేస్తున్నాయని విమర్శించారు. అధికారంలోకి రాకముందు ఒకమాట, అధికారంలోకి వచ్చిన తరువాత మరో మాట చెప్పే విధానాలను రాజకీయ పార్టీలు మానుకోవాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ.. గత ఎన్నికలకు ముందు సీపీఎస్ రద్దు చేస్తామని వైసీపీ చెప్పి ఆ తరువాత అధికారంలోకి వచ్చిన తరువాత సీపీఎస్ బదులు జీపీఎస్‌ను అమలులోకి తీసుకు వచ్చిందని విమర్శించారు. కార్పొరేట్లకు సబ్సిడీలు ఇచ్చేటప్పుడు లేని ఆర్థిక ఇబ్బందులు ఉద్యోగుల హక్కు అయిన ఓపీఎస్ ఇస్తే ఎలా ఇబ్బందులు వస్తాయో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, కె.దాలయ్య, పి.గణపతిరావు, డి.వైకుంఠరావు, పి.మోహనరావు, జి.కవీశ్వరరావు, ఎల్ఎస్‌కొల్లి, ఎం. శంకరరావు తదితరులు పాల్గొన్నారు. జి.నారాయణరావు, ఆర్.దమయంతి, సుధీర్, కె.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీడి మద్దతు ధర కోసం రేపు ధర్నా



ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

పలాసరూరల్: జీడికి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు జీడి మద్దతు సాధన ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు శనివారం గురు దాసుపురం, కొబ్బరిచెట్లపూరు, పెద్ద, చిన్న నీలావతి గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. జీడి మద్దతు ధరపై సీఎంవో ఇచ్చిన హామీ లను వెంటనే అమలు చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ధర్నా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తెప్పల అజయ్‌కుమార్, ఎం.రామారావు, వినోద్‌కుమార్, జి.డిల్లీరావు, పి.టీకారావు, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

నందిగాం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహిస్తున్నట్లు బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ బి.దమయంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదవ తర గతికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు ఆయా విద్యార్థులు నిర్దేశించిన సమయానికి గంట ముందు హాజరు కావాలని సూచించారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు

గంగివలస (పోలాకి): గంగివలస కస్తూర్బా గాంధీ బాలిక గురుకుల విద్యాలయంలో 2024-25 సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రత్యేకాధికారి జి.శారద తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఆరో తరగతితో పాటు 7,8,9 తరగతుల్లో ఖాళీ సీట్లను భర్తీచేస్తున్నట్టు చెప్పారు. ఈనెల 12 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఐదోతరగతి ఉత్తీర్ణులైన బాలికలు మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేయాలన్నారు. ఇతర వివరాలకు పాఠశాల పనిచేయు వేళల్లో సంప్రదించాలని కోరారు.

ఎండల మల్లన్న ఆదాయం రూ.6.68 లక్షలు

టెక్కలి: మహాశివరాత్రి ఉత్సవాలు సందర్భంగా రావివలస ఎండల మల్లన్న ఆదాయం రూ.6,68,580 వచ్చినట్లు ఈవో వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. కేశఖండన, డొనేషన్లు, హుండీ, శీఘ్ర దర్శనం, శిరోభిషేకం మూలంగా ఈ ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాది కన్నా సుమారు 1.19 లక్షలు ఆదాయం తగ్గిందన్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సహకరించిన సబ్ కలెక్టర్, పోలీస్, పంచాయతీ రాజ్, ఆరోగ్యశాఖ, అగ్నిమాపకశాఖ, ఆర్అండ్‌బీ శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ ఉన్నారు.

సోలార్‌తో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్

టెక్కలి: ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ పూర్తి చేసిన విద్యార్థులు సోలార్‌పవర్ సాయంతో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌ను తయారు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం విద్యార్థులను డైరెక్టర్ వీవీ నాగేశ్వర రావు అభినందించారు. ఈ సిస్టం వల్ల శ్రమ, సమయం గణనీయంగా ఆదా అవుతాయన్నారు. ఈఈఈ విభాగంలో అన్ని గదుల్లో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రామారావు, డీన్ విజయ్‌కుమార్, ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

కురిసింది వాన..

పాతపట్నం: పాతపట్నంలో శనివారం సాయంత్రం వర్షం పడింది. ఉదయం ఎండగా ఉండగా సాయం త్రం వర్షంతో పట్టణ ప్రజలు ఉపశమనం పొందారు. శుక్రవారం కూడా పలు ప్రాంతాల్లో వాన పడింది. ఈ వర్షం జీడి మామిడి వంటి పంటలకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.



నేడు అచ్చెన్న పర్యటన

నందిగాం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం మండలంలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ మండల నాయకులు పి.అజయ్‌కుమార్, ఎం.బాలకృష్ణ తెలిపారు. కొండల ప్రాంతం హర్షబాడ పంచాయతీ మలియాలింగుపురం, కొత్తగ్రహారం పంచాయతీ జడ్యాడ గ్రామాల్లో ఎంపీ రామ్మోహన్‌నాయుడుతో కలిసి పర్యటిస్తారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం

హిరమండలం: గ్రామాల్లో ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని టెక్కలి డీఎల్పీవో వెంకటరమణ అన్నారు. శనివారం హిరమండలం పంచాయతీ కార్యాలయంలో అన్ని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈవో నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

15న సర్వసభ్య సమావేశం

పోలాకి: పోలాకి సహకార సొసైటీ పాలకవర్గ సమావేశం ఈనెల 15న వెదుళ్లవలస సొసైటీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, సీఈవో బి.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరుగు సమావేశానికి సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

ప్రతి పేదవాని గుండెలో ఎర్రన్నకు స్థానం

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



ఎర్రన్నాయుడు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అచ్చెన్నాయుడు

మెళియాపుట్టి: ప్రతి పేదవాని గుండెలో దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడకు స్థానం ఉందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం సాయంత్రం గొప్పిలిలో ఎర్రన్నాయుడు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీ స్థాయిలో రాష్ట్రానికి పేరు తెచ్చిన నాయకుడని కొనియాడారు. ఎర్రన్నాయుడు ఆశయాలు కొనసాగిస్తామన్నారు. జిల్లా అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారని, అయితే కొన్ని శక్తులు ఆ ముద్రను చెరిపేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇది వారి తరంకాదన్నారు. అంతకుముందు బైక్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, నేతలు తిరుపతిరావు, బాస్కర్‌గౌడో వసంత్, కదం బల ఫైడిరాజ్, పరమేష్ రెడ్డి, వజ్జ బాబూరావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మా భూములను కాపాడే చర్యలు తీసుకోండి

● శిరీషకు సరియాపల్లి గ్రామస్థుల వినతి

పలాసరూరల్: తరతరాల నుంచి తాము వ్యవసాయం చేస్తున్న భూమిని ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, వైసీపీ నాయకులు బలవంతం గా లాక్కుని అక్రమా లకు పాల్పడుతున్నారని సరియాపల్లి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములను కాపాడాలని కోరుతూ టీడీపీ ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషకు బాధితులు బత్తిన రాజులమ్మ, జ్యోతి, బెండి రామారావు, బెండి మహేష్ తదితరులు కోరారు. ఈ మేరకు శనివారం టీడీపీ కార్యాలయంలో ఆమెను కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. పూర్వీకుల నుంచి జీవనాధారంగా ఉన్న భూమిని ప్రభుత్వ ఆర్డర్ అని చెప్పి మట్టితో కప్పివేశారని, పక్కనే సాగు భూముల ఆధారంగా ఉన్న చెరువు కబ్జాచేసి లేఅవుట్ వేశారని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా మని, వారు అవి మా భూములుగా గుర్తించినా కొందరు వైసీపీ నాయకులు భయపెడుతూ సర్వే రాళ్లు పాతుతున్నారని, అధికార పార్టీ కావడంతో అధికారులు ఏమీ చేయలేకపోతున్నారని, మా భూములను కాపాడుకునేందుకు సహకరించాలని కోరారు.

మహిళా హక్కులపై పోరాటమే శరణ్యం

వజ్రపుకొత్తూరు: మహిళల హక్కుల సాధనకు పోరాటమే శరణ్యమని ఐద్వా జిల్లా నాయకురాలు బి.సుగుణ, శ్రామిక మహిళా నాయకురాలు ఎం.మంజుల అన్నారు. శనివారం నువ్వలరేవులో మహిళా దినోత్స వం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా సాధికారితపై ప్రచారమే తప్ప ఆచరణలో కానరావడం లేదన్నారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, బి.చామంతి, ఇందు, కమల, విజయలక్ష్మి, నిర్మల, యశోద తదితరులు పాల్గొన్నారు. ● **పలాసరూరల్:** మహిళల హక్కులను పరిరక్షించుకోవాలని, దీనికోసం మహిళంతా ఏకం కావాలని ఐఫా మహిళా సంఘ సభ్యులు కోరారు. నీలావతి, కొబ్బరిచెట్లూరు గ్రామాల్లో మహిళా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. మహిళల హక్కుల సాధనకు చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఐఫా సంఘ సభ్యులు తామాడ దాలమ్మ, లక్ష్మి, ఎస్.జానకమ్మ, చంద్రావతమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో 60 వైసీపీ గిరిజన కుటుంబాలు చేరిక



పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న గౌతు శిరీష

పలాస, మార్చి 9: మందస మండలం కొండలోగాం, నర్సింగిపురం, కుసుమాల గ్రామాలకు చెందిన 60 వైసీపీ గిరిజన కుటుంబాలు టీడీపీలో చేరాయి. శనివారం టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదు పాయాలు కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలకు కనీస సౌక ర్యాలు కల్పించక పోగా ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. టీడీపీలో చేరిన గిరిజన నాయకులు మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లో తాగునీరు ఇవ్వలేదని, రోడ్లు సైతం అధ్వానంగా మారినా పట్టించుకోలేదన్నారు. అందువల్లే ఆ పార్టీని వీడి టీడీపీలో చేరామన్నారు. టీడీపీలో చేరిన వారిలో గిరిజన నాయకులు సవర రవికుమార్, రామారావు, జైపాల్, దానేల్, అబి రామ్, గబ్రీల్, చిన్న, రామారావు, ధర్మారావు, నర్సింగ్‌తో పాటు 60 కుటుంబాలున్నాయి. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, నేతలు రట్టి లింగరాజు, బమ్మిడి కర్రయ్య, సవర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ ఎమ్మెల్యే అశోక్ ప్రచారం

ఇచ్ఛాపురంలో మళ్లీ టీడీపీ జెండా ఎగురవేయాలని పిలుపు

సోంపేట: ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ పట్టణంలో ప్రచారం ముమ్మరం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని కోరారు. నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలో, ఇచ్ఛాపురంలో తెలుగుదేశం జెండా ఎగరాలని కోరారు. ఆయన వెంట నాయకులు సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు, మద్దిల నాగేశ్వరరావు, బొడ్డ రాంకుమార్, దూసి మధుసూధన్, బీన ఆనంద్, చిత్రాడ శేఖర్ తదితరులు ఉన్నారు.


టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తున్న ఎమ్మెల్యే అశోక్

అన్ని దానాల్లోనూ అన్నదానం గొప్పది

అరసవల్లి: అన్ని దానాల్లోనూ అన్నదానం గొప్పదని.. అన్నార్తుల కోసమే అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదల ఆకలి తీరుస్తున్నామని ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు గొండు శంకర్ అన్నారు. శనివారం నాటికి ఈ అన్న క్యాంటీన్ సేవ లను ప్రారంభించి 325 రోజులవుతోందని తెలిపారు. స్థానిక ఏడు రోడ్ల జంక్షన్, పాత బస్టాండు వద్ద అన్నదాన సేవలను కొనసాగించారు. మొబైల్ వ్యాన్ల ద్వారా నగరంలో పలుచోట్ల పేదలకు, నిరాశ్రయులకు భోజనాలను అందజేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్లను ప్రారంభించి, లక్షలాదిమంది పేదల ఆకలి తీర్చారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక జగన్మోహన్‌రెడ్డి అన్న క్యాంటీన్లను రద్దు చేసిందన్నారు.



నిజాయితీకి గుర్తింపు: గుండ దంపతులు

అరసవల్లి: నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేసే వారికి పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. ఇప్పిలి గ్రామానికి చెందిన ఇప్పిలి శివ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా శనివారం నగరంలోని ఎల్.ఎన్.కన్వెన్షన్ హాల్‌లో అభినందించారు. ఈ సందర్భంగా గుండ దంపతులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో గెలిచి... తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా శివను వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, రాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజె.బాబు, చిట్టి నాగభూషణరావు, కొర్ను నాగార్జున ప్రతాప్, ఐటీడీపీ అధ్యక్షుడు ప్రదాన విజయరాం, బరాటం ఉదయశంకర్ గుప్తా, ముద్దాడ కృష్ణమూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్ కార్మికులకు పనికి తగిన వేతనం చెల్లించండి



రణస్థలం: స్కీమ్ కార్మికులకు పనికి తగిన వేతనం చెల్లించాలని సీటు నాయకుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. శనివారం జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళల హక్కులు, స్వేచ్ఛ కోసం పోరాటం చేయడమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తిని కొనసాగించడమని అన్నారు. ఆశ, మధ్యాహ్న భోజన పథకం తదితర స్కీమ్ కార్మికుల శ్రమకు తగిన ఫలితం ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీ చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కె.సుజాత, ఆర్.అప్పమ్మ, బి.స్వాతి, బి.అసిరితల్లి, బి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

ప్రకృతి వ్యవసాయంతో మేలు

గార: రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చని ఎం.పి.పి. గొండు రఘురామ్ అన్నారు. శనివారం ఉదయం శాలిహుండాం ఆర్.బి.కె.లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసే రైతులకు ఘన జీవామృతం, కషాయం తయారు చేసుకోవడానికి అవసరమైన ప్లాస్టిక్ డ్రమ్ములను పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా డి.పి.ఎం.రేవతి, నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, సర్పంచ్ కె.ఆదినారాయణ ఎం.పి.టి.సి. సభ్యులు గుండ బాస్కరరావు, కోట రామారావు, చింతల గడ్డెయ్య జెడ్.బి.ఎన్.ఎఫ్. సిబ్బంది పాల్గొన్నారు.

100 మంది పేదలకు అన్నదానం

ఇచ్ఛాపురం: నిరుపేద కుటుంబాలకు చెందిన అభాగ్యులకు, దివ్యాంగులకు మొత్తం వందమందికి ఇంటర్ విద్యార్థి దాసరి బన్ని శనివారం 100 ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. శనివారం పాతబస్టాండ్ జంక్షన్, లొద్దపుట్టి దనేశ్వరి అమ్మవారి ఆలయం, చిదంబరేశ్వర ఆలయం వద్ద బిక్షాటన చేస్తున్న వారికి అందించాడు.


భక్తులకు దర్శనమిస్తున్న బాలయోగి

బాలయోగి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పొందూరు: నందివాడ బాలయోగి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఏటా మహాశివరాత్రి, మరుసటి రోజు రెండు రోజుల పాటు బాలయోగి దర్శనానికి కమిటీ ఏర్పాట్లు చేస్తుంది. ముఖ్యంగా మహాశివరాత్రి మరుసటి రోజు భక్తులు ఎక్కువగా తరలివస్తారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు భోజన ఏర్పాట్లు చేశారు.


దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియా యువకులు

కొనసాగుతున్న బెంతు ఒరియాల దీక్ష

కవిటి: బెంతుఒరియా కులస్థులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ కవిటిలో చేపట్టిన నిరసన దీక్ష కొనసాగుతోంది. 73వ రోజైన శనివారం బొరివంక గ్రామానికి చెందిన యువకులు కూర్చొని తమ నిరసన తెలిపారు. సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేయాలని వారు డిమాండు చేశారు. తమ డిమాండ్‌ను ఎవరూ పట్టించుకోకపోవటం దారుణమన్నారు. తమకు గుర్తింపు లేక విద్యార్థులు ఎంతగా నష్టపోతున్నారో ఎవరికీ అర్థం కావడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

మహాశివుని విగ్రహ ప్రతిష్ఠ

ఇచ్ఛాపురం: బిర్లంగి గ్రామంలో నూతనంగా నిర్మించిన మహాశివుని విగ్రహం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా, పీఏసీఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

రెండు ఆటోలు ఢీ

● ఏడుగురికి గాయాలు

రణస్థలం: రణస్థలం మండలం కొండములగాం సమీపంలో శనివారం రాత్రి రెండు ఆటోలు ఢీకొని ఏడుగురికి గాయాలయ్యాయి. జీడిపాలెం గ్రామానికి చెందిన కొంతమంది శనివారం ఆటోలో రామతీర్థం యాత్రకు వెళ్లారు. రాత్రి స్వగ్రామానికి తిరిగొస్తుండగా కొండములగాం సమీపంలో ఎదురుగా వస్తున్న లగేజీ ఆటోను ఢీకొన్నారు. దీంతో ఆటోలో ఉన్న లక్ష్మి, కాములు, పి.అప్పన్న, ఎస్.అప్పన్నతోపాటు మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వీరిలో ముగ్గురిని శ్రీకాకుళంలోని ఆస్పత్రికి తరలించారు. కొండములగాం పీహెచ్‌సీలో నలుగురు చికిత్స పొందుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జి.సిగడాం: స్థానిక విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని అన్ని గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఈఈ ఎస్.బయ్యన్నాయుడు, ఏఈ ఆర్.తిరుపతిరావులు తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రంలో అదనపు 11కేవీ చెట్టుపొదిలాం ఫీడర్ ఏర్పాటుతో పాటు మరమ్మతుల నిమిత్తం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

పొందూరు: కింతలి సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బయ్యన్నాయుడు, ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు.

టీడీపీలోకి వైసీపీ సర్పంచ్

సరుబుజ్జిలి: గోనిపాడు గ్రామ పంచాయతీకి సర్పంచ్ బిర్లంగి అమ్మాయమ్మ వైసీపీని వీడి టీడీపీలో చేరనున్నారు. ఈ నెల 10న (ఆదివారం) గోనుపాడు గ్రామంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కూన రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శంఖారావం కార్యక్రమంలో సర్పంచ్ అమ్మాయమ్మతో పాటు వైసీపీ నాయకులు నాగేశ్వరరావు తదితరులు టీడీపీలో చేరనున్నారని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుతో రాష్ట్రంలో టీడీపీ అఖండ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

ఎచ్చెర్ల: ఎస్ఎంపురం గ్రామంలో ఏపీ గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఇప్పటికే ఒకసారి అధికారులు గురుకుల స్థలంలో నిర్మాణాలు చేపట్టొద్దని హెచ్చరించారు. ఈ స్థలం ఆక్రమణలకు గురికాకుండా చూడాలని సిబ్బంది ఇటీవల రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అక్రమ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలియడంతో మరోసారి వీఆర్వో భాస్కరరావు, పోలీసులు శనివారం ఆ స్థలానికి చేరుకుని పనులు ఆపాలని సూచించారు. దీనిపై తహసీల్దార్ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని సర్వే చేయించామని.. దీనిపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. ఎవరైనా అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధర్మవరంలో ఎన్ఎస్ఎస్ శిబిరం

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో ధర్మవరం గ్రామంలో శనివారం ప్రత్యేక సేవా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ నెల 15వ తేదీ వరకు జరగనున్న ఈ శిబిరంలో ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన, సేవ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం అలవర్చేలా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు పీవో డాక్టర్ డి.తాతారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అల్లు కన్నబాబు, ఎంపీటీసీ సభ్యుడు బగ్గు రాజారావు, మాజీ సర్పంచ్ వై.నాగరాజు, టీడీపీ నేత ఆర్.రమేష్, యువజన సంఘ ప్రతినిధులు ఆర్.లక్ష్మీనాయుడు, ఆర్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

ఆమదాలవలస: పట్టణంలోని భవిత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సమావేశం శనివారం ఘనంగా జరిగింది. చిన్నారుల నృత్యాలు అలరించాయి. సినీ గేయాలకు హైస్కూల్ విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు జరిగిన సమావేశంలో పాఠశాల కరస్పాండెంట్ సువ్వారి మురళీధరరావు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ ఎస్.సునీత, అతిథులు పి.మురళీకృష్ణ, జె.నరేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


నృత్యాలు చేస్తున్న చిన్నారులు


కిరణ దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

నిరాశపరిచిన భానుడు

● ఆదిత్యుని తాకని కిరణాలు

అరసవల్లి: అరసవల్లి ఆదిత్యుని భక్తులకు నిరాశ ఎదురైంది. శనివారం ఉదయం ఆదిత్యునికి సూర్యకిరణాలు తాకితే.. చూసి తరించాలని వేకువజాము నుంచే భక్తులు ఆలయం వద్ద బారులుతీరారు. ఈ అపురూప దృశ్యాన్ని వీక్షించాలని ఎదురుచూశారు. కానీ వాతావరణం మబ్బులు పట్టి ఉండడంతో స్వామి వారిని దర్శించుకుని నిరాశతో వెనుదిరిగారు. నేడు (ఆదివారం) కూడా సూర్యకిరణాలు ఆదిత్యుని తాకనున్నాయని ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తి హల్‌చల్

శ్రీకాకుళం క్రైం: నగరంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. వివరాల్లోకి వెళితే... స్థానిక పందుంపుల్ల జంక్షన్‌లో శనివారం మధ్యాహ్నం ఓ వ్యక్తి పూటుగా తాగి రోడ్డుకి అడ్డంగా పడుకొని ట్రాఫిక్‌కు అంతరాయం సృష్టించాడు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు అవస్థలు పడ్డారు. స్థానికులు అతన్ని పక్కకు తొలగించే ప్రయత్నం చేయగా... ఒంటి నిండా గాయాలు కనిపించాయి. దీంతో 108కు సమాచారం ఇచ్చారు. స్థానికులు రిమ్స్‌కు తరలించే ప్రయత్నం చేయగా... అతడు సహకరించకపోవడంతో బలవంతంగా రోడ్డు పక్కకు తరలించారు. దీంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారమైంది.

ట్రాక్టర్ బోల్తా

● ఒకరి మృతి, ఏడుగురికి తీవ్ర గాయాలు

చింతపల్లి: జాతీయ రహదారి నిర్మాణానికి సామగ్రిని తరలిస్తున్న ఓ ట్రాక్టర్ అంతర్ల మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఓ కూలీ మృతి చెందగా, మరో ఏడుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించి స్థానికుల కథనం ప్రకారం.. శనివారం ఉదయం జాతీయ రహదారి విస్తరణ పనుల్లో పనిచేస్తున్న కూలీలు ట్రాక్టర్‌లో విద్యుత్ స్తంభాల సామగ్రిని లోడ్ చేసుకుని పెంటపాడు నుంచి లంబసింగి తరలిస్తున్నారు. అంతర్ల మలుపు వద్ద ట్రాక్టర్ బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం సాగరవనవంగం గ్రామానికి చెందిన కూలీ పత్రాసి సంతోశ్(28) సంఘటన స్థలంలో మృతి చెందాడు. ఒడిశా, బిహార్ ప్రాంతాలకు చెందిన కూలీలు సాహంల్, అన్వర్‌ఖాన్, జరీఫ్‌తోపాటు మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యాధికారి వి.రుక్మిణి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన కూలీల ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అరుణ్‌కిరణ్ తెలిపారు.

శివాలయాల వద్ద అన్న సమారాధన

జి.సిగడాం: శివరాత్రి మహోత్సవాల సందర్భంగా జి.సిగడాం, డీఆర్‌వలస, ఎందువ, ఆనందపురం, మెట్టవలస, సంతవురిటి తదితర గ్రామాల్లోని శివాలయాల వద్ద శనివారం భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని... స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. శివపార్వతులకు కల్యాణాలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాలలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు, ఆలయాల ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.


డీఆర్‌వలసలో అన్నదానం చేస్తున్న గ్రామ పెద్దలు

కన్యకాపరమేశ్వరికి పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

ఇచ్ఛాపురం: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వేచ్ఛావతి అమ్మవారి గుడి వీధిలో కొలువుతీరి ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిళలు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఉంటూ...ఆలయంలో అర్చనలు చేశారు.

ఘనంగా షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం


బాబాకు పూజలు చేస్తున్న భక్తులు

కంచిలి: కంచిలి గ్రామంలో గల షిర్డీ సాయిబాబా మందిరం 17వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. బాబాకు హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి వేడుకలు


వీరబ్రహ్మేంద్ర స్వామి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న స్వర్ణకారులు

ఇచ్ఛాపురం: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి వేడుకలను స్థానిక స్వర్ణకారులు శనివారం ఘనంగా నిర్వహించారు. రథం వీధి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన పోతులూరి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. 500 మందికి అన్న సంతర్పణ చేశారు.

కళాకారుడికి సన్మానం


త్రినాథ్ మాస్టారును సన్మానిస్తున్న సర్పంచ్

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన రైల్వే మాజీ ఉద్యోగి, సీనియర్ కళాకారుడు మావూరు త్రినాథ్ మాస్టారును ఘనంగా సత్కరించారు. శనివారం టీబరంపురం సీతారామ ఆలయ ప్రాంగణంలో తోటి కళాకారులు, గ్రామ సర్పంచ్ కారంగి త్రినాథరెడ్డి శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాకారిణి పెదిని ధనవతి, తిప్పన ధనుంజయరెడ్డి, డి. మోహన్‌రావు, డి.నారాయణ, కాళిదాసు, కేశవులు, నూకరాజు పాల్గొన్నారు.

160 స్థానాల్లో కూటమి విజయం ఖాయం

ఆమదాలవలస: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రాష్ట్రంలో 160కి పైగా స్థానాలలో విజయం సాధించడం ఖాయమని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పేడాడ సూరపునాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శనివారం ఢిల్లీలో జరిగిన చర్చల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అగ్రనేతలు పొత్తు కుదుర్చుకోవడం శుభపరిణామమన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. కేంద్రంలో బీజేపీ 370 స్థానాలు సాధించి ప్రధానమంత్రి మోదీ చరిత్రకు ఎక్కడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు వేల్పుల గోవిందరావు, పిల్లా జగన్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ కన్వీనర్ సూరపునాయుడు

సమస్యల పరిష్కారం కోసం 14న దేశవ్యాప్త ఆందోళన

కాశీబుగ్గ: రైతు సమస్యల పరిష్కారానికి ఈ నెల 14న దేశ వ్యాప్త ఆందోళన చేపడుతున్నట్టు వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. శనివారం కాశీబుగ్గలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పలువురు నేతలు మాట్లాడుతూ.. ఢిల్లీలో రైతులు ఆందోళన చేపడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలు రద్దు, స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు, పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ లిచ్చినా నేటికీ అమలు చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో చేపట్టనున్న ఆందోళనలో రైతులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోహన్‌రావు, సీపీఐ నాయకులు వేణుగోపాల్, మాధవరావు, గణపతి, భాస్కర రావు, గురయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

ఒడిశా

బీజేడీ అత్యంత బలమైన పార్టీ

పర్లాకిమిడి: రాష్ట్రంలో బీజూ జనతాదళ్ (బీజేడీ) అత్యంత బలమైన పార్టీ అని సీనియర్ నాయకులు, హైటెక్ విద్యా సంస్థల చైర్మన్ తిరుపతి పాణిగ్రాహి అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ రెండు రోజులుగా జిల్లాలో బీజేడీ-బీజేపీ పొత్తుపై రకరకాల చర్చలు జరుగుతున్నాయని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో కూడా ప్రచారాలు సాగుతున్నాయని చెప్పారు. దీంతో పార్టీ నాయ కులంతా గందరగోళానికి గురయ్యారని అన్నారు. జిల్లాలో గల రెండు సామాజిక వర్గాలలో బిజూ జనతాదళ్ పార్టీ బలంగా ఉందన్నారు. సీఎం నవీన్ పట్నాయక్ ఎవరికి టికెట్ ఇచ్చినా అత్యధిక మెజార్టీతో గెలుపించుకుంటామని చెప్పారు. రెండు పార్టీల పొత్తుపై అధిష్ఠానం నుంచి ఎటువంటి సంకేతాలు లేవని... ఇటువంటి పుకార్లను కార్యకర్తలు నమ్మవద్దని కోరారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

పర్లాకిమిడి: పట్టణంలోని అన్ని శివాలయాల్లో శుక్రవారం శివపార్వతుల కళ్యాణ ఘట్టం అంగరంగ వైభవంగా జరిగింది. పొడుగు దేవాలయంలో ఉత్సవ మూర్తులకు శనివారం తిరువీధులు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.


శివపార్వతుల తిరువీధులు నిర్వహిస్తున్న దృశ్యం